క్లుప్తంగా

అంకమ్మ కొలుపుల్లో సర్నాల పూజలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): నల్లగొర్ల వారి అంకమ్మ అమ్మవారి కొలుపుల ఉత్సవాల్లో మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పాల్గొన్నారు. కొండపల్లిలో సోమవారం జరిగిన ఉత్సవాల్లో ఆలయ కమిటీ పెద్దలు తిరుపతిరావుకు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంకమ్మ అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్ట్

తిరువూరు: ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం తిరువూరు సర్కిల్‌లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. విస్సన్నపేటలో సారా విక్రయిస్తున్న మార్నెళ్ల సీమయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఏడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గంపలగూడెం మండలం రాజవరంలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న చలమల రామకృష్ణ నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడ పోటీల్లోనూ రాణించాలని విజయవాడ నార్త్ మండల విద్యాశాఖాధికారి ఎ.వెంకటరత్నం సూచించారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ఎలిమెంటరీ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు సోమవారం ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి స్కూల్‌కి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వి.ప్రమీలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరిసిన నూజివీడు విద్యార్థులు



తేజసాయి, రమణక్కపేట జెడ్పీ పాఠశాల (574) | డీఎస్‌వీ సాయి, వేల్పుచర్ల జెడ్పీ పాఠశాల (574) | నేహప్రశాంతి, రమణక్కపేట జెడ్పీ విద్యార్థిని (573) | చిట్టిపావని, ముసునూరు గురుకుల విద్యార్థిని (577) | షబనామహారాజ్, నూజివీడు జెడ్పీ హైస్కూల్ (583) | బి. భువనేశ్వరి,నూజివీడు జెడ్పీ హైస్కూల్ (583) | వై. రేష్మశ్రీ, నూజివీడు జెడ్పీ హైస్కూల్ (577) | పావన రమ్య, నూజివీడు జెడ్పీ హైస్కూల్ (566)

నూజివీడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూజివీడు పట్టణం, మండల ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గతం కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ విద్యార్థులు డివిజన్ స్థాయిలోనే ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ పాఠశాల నుంచి 215 మంది విద్యార్థులకు గాను 162మంది పాసై 75 శాతం ఉత్తీర్ణతను సాధించారు. 550 మార్కులకు పైగా 16 మంది, 500 మార్కులకు పైగా 40 మంది విద్యార్థినులు పాసయ్యారు. షేక్ షబనామహారాజ్, బి.భువనేశ్వరిలు 583, యాదల రేష్మాశ్రీ 577, రామనోళ్ల రూపశ్రీ 576, కొయ్యని గుణగాయత్రి 570, చిట్టిమాడ పావన రమ్య 566, షేక్ నబేలా ఫాతిమా, సామిరెడ్డి అక్షయదీపికలు 564, అల్లు నాగపూజిత 563, మండల భవ్యశ్రీ 561, బొందిలి మహేశ్వరిబాయి 557, ఉప్పు గాయత్రి 556, షేక్ తస్లీమా 555, షేక్ షిఫా తహసీన్ 554, శటారి మహిమ ప్రణతి 551 మార్కులు సాధించారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 168 మందికి 107 మంది ఉత్తీర్ణులు కాగా ఎస్. రమ్యశ్రీ 557, కేవీ సాయిచైతన్య 544, ముక్తియార్ అహ్మద్ 543 మార్కులు సాధించారు. గొల్లపల్లి హైస్కూల్‌లో 76 మందికి 59 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆముదాల అను, టి.కావ్యశ్రీ 570 మార్కులు సాధించారు. పల్లెర్లమూడి హైస్కూల్‌లో 66 మందికి 52 మంది, యనమదల హైస్కూల్‌లో 35 మందికి 26మంది ఉత్తీర్ణులయ్యారు. మీర్జాపురం హైస్కూల్‌లో 100 మందికి 81 మంది ఉత్తీర్ణులు కాగా పి.శైలజ 579 మార్కులు సాధించింది. గురుకుల పాఠశాలలో 76 మందికి 73 మంది ఉత్తీర్ణులయ్యారు. బి.ప్రేమ చంద్రిక 584 మార్కులు సాధించింది. దిగవల్లి హైస్కూల్‌లో 19 మందికి 14 మంది, అన్నవరం హైస్కూల్‌లో 29 మందికి 25 మంది, దేవరగుంట హైస్కూల్లో 29 మందికి 19 మంది, కోటవారిగూడెం హైస్కూల్‌లో 10 మందికి 9 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆగిరిపల్లి మండలంలో 70 శాతం ఉత్తీర్ణత..

ఆగిరిపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 405 విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 284 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్లో 157 మందికి 127 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత తెలిపారు. ఈదర జెడ్పీ స్కూల్లో 84 మందికి 53 మంది, ఈదులగూడెం 53కి 34, ఎం. సురవరం 42కి 27, అడవినెక్కలం 69 మందికి 43 మంది ఉత్తీర్ణత సాధించారు. కె.కుమార్ సింగ్ (అడవినెక్కలం) 536 మార్కులతో మండల ప్రథమ, ఆర్. లస్నిక (ఆగిరిపల్లి) 534 మార్కులతో ద్వితీయ, మధులత (ఈదులగూడెం) 530 మార్కులతో తృతీయ స్థానాల్లో నిలిచారు. మండలంలోని చుక్కపల్లి పబ్లిక్ స్కూల్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన జోష్ణప్రియ 589 మార్కులు సాధించిందని ఎంఈఓ వివరించారు.

ముసునూరు మండలంలో 84 శాతం ఉత్తీర్ణత

ముసునూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ బీవీ సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఏడు జెడ్పీ స్కూల్స్ నుంచి 508 మంది పరీక్షలకు హాజరు కాగా 425 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. రమణక్కపేట, వేల్పుచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రంగు తేజ సాయి, డీఎస్‌వీ సాయి 574 మార్కులతో మండల ఫస్ట్ సాధించగా, రమణక్కపేట జెడ్పీ విద్యార్థి రంగు నేహ ప్రశాంతి 573, గోపవరం జెడ్పీ పాఠశాల విద్యార్థి డి.సంజన 562 మార్కులతో మండల ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని వివరించారు.

ముసునూరు గురుకుల విద్యాలయం నూరుశాతం ఉత్తీర్ణత..

ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయం నుంచి 79 మంది బాలికలు హాజరు కాగా 77 మంది ప్రథమ, ఇద్దరు ద్వితీయ స్థానంతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. విద్యార్థిని తోట చిట్టిపావని 577 మార్కులు సాధించిందన్నారు. 599తో స్టేట్ ఫస్ట్ సాధించిన నాగసాయి మనస్వి కూడా మండలంలోని రమణక్కపేటకు చెందిన విద్యార్థిని కావడం విశేషం.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

విస్సన్నపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో స్థానిక సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ మేడా శ్రీహర్ష తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని మల్లూరి శ్రీవల్లిక పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 592 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో టాపర్‌గా నిలిచిందని, అలాగే తమ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మేడా మోహనరావు అభినందించారు.

శ్రీ శ్రీ విద్యార్థుల ప్రతిభ

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీశ్రీ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని పాఠశాల డైరెక్టర్లు ఎన్. వెంకట్, రాజేంద్రప్రసాద్, రాజేశ్వరరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎస్. లిఖితశ్రీ 589, ఎ. భవిత 588, డి. నవ్య 587, జీవీ సత్యనారాయణ 581, టి. గుణవర్ధిని 580 మార్కులు సాధించారన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

తిరువూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా విశ్వబ్రాహ్మణులు లబ్ధి పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆదివారం రాత్రి తిరువూరు సూర్యా ఫంక్షన్ హాల్‌లో విశ్వబ్రాహ్మణుల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణులకు సామాజిక భవన నిర్మాణం, వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయానికి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఆర్‌కే చారి, సంఘ సభ్యులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారి, తరుమణి రామకృష్ణ, ఆడెపు కోటేశ్వరరావు, గంటల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

క్లుప్తంగా

నేడు స్వామిదాసు ఎన్నికల ప్రచారం

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు ఎన్నికల ప్రచారం స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ నుంచి మంగళవారం ఉదయం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని కోరారు.

పనులు యథావిధిగా కొనసాగించాలి



ముసునూరు: అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అభిప్రాయపడింది. సోమవారం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీ దేవి ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా జాగ్రత్త వహించాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మాజీ ఎంపీపీ కృష్ణకుమారి కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



గండ్రాయి(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లల్లో చేసిన సంక్షేమ అభివృద్ధిని చూసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తొమ్మిది టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి గ్రామ సీనియర్ నాయకులు కనపర్తి శేష గిరిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో అమరబోయిన సత్యన్నారాయణ, కొరివి హరి కృష్ణ, నాగరాజు, ఉపేందర్, నాగాటి ఈశ్వర్, సాధనాల చిన్న సైదులు, కర్నే కృష్ణ, గోని శ్రీరాంమూర్తి, నాగాటి బ్రహ్మం ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచిలూర్దు మేరి, గ్రామ పార్టీ అధ్యక్షులు కనపర్తి ప్రసాద్, నాయకులు కొరివి శ్రీను, రమేష్, లక్ష్మయ్య, అంజి పాల్గొన్నారు.

త్రివిధ విద్యార్థుల ప్రతిభ



బండారు హాసిని



సాగి వర్షిత



జల్లు దివాకర్ నిఖిత శ్రీ



పంబా లాలిత్య

నూజివీడు: పట్టణంలోని త్రివిధ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల నుంచి 194 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా, 193 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బండారు హాసిని 594, సాగి వర్షిత 593, జల్లు దివాకర్ నిఖిత శ్రీ 592, పంబా లాలిత్య 591మార్కులు సాధించారని తెలిపారు. వీరందరినీ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సత్తా చాటిన కుమార్ స్కూల్ విద్యార్థులు



నూజివీడు: స్థానిక కుమార్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు కుమార్ స్కూల్ చైర్మన్ పిన్నమనేని వెంకట కుమార్ తెలిపారు. పరీక్షకు 175 మంది హాజరుకాగా 175 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆర్. హంసిత్‌బాబు 594, వై. వైష్ణవి, యూ. మదన్‌మోహన్ 592, కె.రోహిత్ 591, జి.ధనుష్క 590 మార్కులు సాధించారని తెలిపారు. వీరందరిని చైర్మన్ వెంకట కుమార్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ట్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు గ్రాడ్యుయేట్ దుస్తులు ధరించి, స్కూల్ యాజమాన్యం అందించిన సర్టిఫికెట్లను పట్టుకుని హుషారుగా కేరింతలు కొట్టారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

- టెన్త్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు
- కార్పొరేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాలు
- ఫలించిన ప్రభుత్వ చర్యలు



డి. స్వప్న, మునుకుళ్ల (556)



ఎస్. సిరి, బాలయోగి గురుకుల విద్యార్థిని (586)



వేమిరెడ్డి పల్లవి, కోడూరు జెడ్పీపీ పాఠశాల (579)



ఎం. నవ్యశ్రీ, కుంట ముక్కల గురుకుల విద్యార్థిని (586)



పి.అనిల్‌కుమార్, కొండపల్లి ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ (582)



పెద్దగవళ్ల లిఖితశ్రీ, గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల (580)

తిరువూరు: గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు వసతులు కల్పించడం, మెరుగైన విద్యాబోధన, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. తిరువూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. మునుకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. స్వప్న 600 మార్కులకు 556 మార్కులు సాధించి మండల ప్రథమస్థానంలో నిలిచింది. కోకిలంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ సుమంత్ 515, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని డి. చరిష్మా 552, తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి డి. అనిల్ 527, తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జి. రియాజ్, కె. సమిత్‌లు 534 మార్కులు, ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి యూ. నంది 544, గానుగపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం. శ్రీజ 551, మల్లేల జెడ్పీ స్కూల్ విద్యార్థి జి. జీతేష్ 479 మార్కులతో ఆయా పాఠశాలల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. గానుగపాడు జెడ్పీ స్కూల్‌లో నూరుశాతం, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 86 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. తిరువూరు శ్రీనిధి హైస్కూల్‌లో కొత్తూరు నందిని 592, సుతారి శ్రీలక్ష్మి 581, సిద్ధార్థ స్కూల్లో షేక్ నసీమా 591, కె. మోహన ప్రియ 585 మార్కులు సాధించారు. శ్రీచైతన్య స్కూల్లో పి. ప్రణీత్ 591, పి. హసీనా 585, డి. భవ్యశ్రీ 584 మార్కులు సాధించారు.

రంగాపురం గురుకుల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత..

రెడ్డిగూడెం: రంగాపురం బాలయోగి గురుకుల పాఠశాల టెన్త్ విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ తబిత సోమవారం తెలిపారు. 83 మంది విద్యార్థులకు గాను 82 మంది ఉత్తీర్ణత సాధించగా 586 మార్కులతో ఎస్. సిరి ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అలాగే కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 39 మందికిగాను 35 మంది ఉత్తీర్ణతతో 90 శాతం సాధించారని ఎస్ఓ శ్యామల తెలిపారు. మద్దులపర్వ ఏపీ మోడల్ స్కూల్‌లో 66 మందికి గాను 65 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వీర్రాజు తెలిపారు. రెడ్డిగూడెం హైస్కూల్‌లో 62 మందికి గాను 40 మంది ఉత్తీర్ణత సాధించగా, కుదప జెడ్పీ హెచ్ స్కూల్‌లో 20 మందికిగాను 15 మంది, నాగులూరు జెడ్పీ హెచ్ స్కూల్‌లో 56 మందికి గాను 44 మంది, జెడ్పీహెచ్ కూనపరాజుపర్వ స్కూల్‌లో 36 మందికి గాను 27 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. రెడ్డిగూడెం గీతాంజలి హైస్కూల్‌లో 78 మందికి గాను 76 మంది ఉత్తీర్ణత సాధించగా నారాయణ హైస్కూల్‌లో 17 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించారు.



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాజు

టెన్త్‌లో చాట్రాయి మండలంలో 84 శాతం ఉత్తీర్ణత



చాట్రాయి మండల టాపర్ యశ్వంత్

చాట్రాయి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చాట్రాయి మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిన్నంపేట జెడ్పీ హైస్కూల్‌లో 81 మందికి 70 మంది పాసయ్యారు. చిత్తపూరు హైస్కూల్లో 33 మందికి 26 మంది, సి.గుడిపాడు 15కి 14, పోలవరం 58కి 50, మర్లపాలెం 38కి 29, చనుబండ 34కి 25, చాట్రాయి 29 మందికి 28 మంది ఉత్తీర్ణత సాధించారు. చిన్నంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జె.యశ్వంత్ 600 మార్కులకు 586 మార్కులు సాధించాడు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి 87.3 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

మైలవరం మండలంలో 70 శాతం ఉత్తీర్ణత

మైలవరం: మైలవరం మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 70 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ ఎల్. బాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల నుంచి 302 మంది బాలురు, 255 మంది బాలికలు మొత్తం 557 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారన్నారు. వీరిలో 148 మంది బాలురు, 246 మంది బాలికలు మొత్తం 394 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల నుంచి స్కూల్ ఫస్ట్‌లో కె.శివపార్వతి 567మార్కులు, కె. స్వప్న 541, జి. వెంకటరావు 487, ఎస్కే ఆఫ్రిన్ 573, పి. సంహిత 521, ఎం. యువరాజు 542, బి. వనజ 440, కోలా ప్రియాంక 433, ఏపీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థిని జె. శ్రావణి 538 మార్కులు సాధించారని ఎంఈఓ వివరించారు.

కొండపల్లి ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 70 మందికి 70 పాసై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పి.అనిల్‌కుమార్ 582 మార్కులు సాధించాడు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో 37 మందికి 32 మంది ఉత్తీర్ణులయ్యారు. జె.శశిరేఖ 545 మార్కులు సాధించింది. ఐదు జెడ్పీ పాఠశాలల్లో 541 మందికి 397 మంది ఉత్తీర్ణులయ్యారు. 17 ప్రైవేట్ పాఠశాలల్లో 723 మందికి 680 మంది పాసయి 94.66 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం వ్యాప్తంగా 24 పాఠశాలలకు చెందిన 1,371 మంది విద్యార్థులకు గాను 1,179 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 88.42 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యా శాఖాధికారులు తెలిపారు.

ఎ.కొండూరు మండలంలో 86 శాతం ఉత్తీర్ణత..

ఎ.కొండూరు: పదో తరగతి ఫలితాల్లో ఎ.కొండూరు మండలం 86 శాతం ఉత్తీర్ణత సాధించింది. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల 100 శాతం, కోడూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 97 శాతం, కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 93 శాతం, పోలిశెట్టిపాడు జెడ్పీ పాఠశాల 91 శాతం, కేజీబీవీ జెడ్పీ పాఠశాల 83 శాతం, కంభంపాడు జెడ్పీ పాఠశాల 82 శాతం, రామచంద్రాపురం జెడ్పీ పాఠశాల 76 శాతం, చీమలపాడు జెడ్పీ పాఠశాల 73 శాతం, ఎ.కొండూరు జెడ్పీ పాఠశాల 57 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేటు పాఠశాలలో హోలీక్రాస్ పాఠశాల, ఎ.కొండూరు గ్రేస్ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. కోడూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వేమిరెడ్డి పల్లవి 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. కంభంపాడు పాఠశాల విద్యార్థి సీహెచ్ శ్యాంకృష్ణ 563 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడని ఎంఈఓ రాజశేఖర్ తెలిపారు.

జి. కొండూరు మండలంలో 73.6 శాతం ఉత్తీర్ణత

జి.కొండూరు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 73.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఏడు జెడ్పీ హైస్కూళ్లు, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మొత్తం 425 మంది విద్యార్థులకు గానూ 313 మంది ఉత్తీర్ణత సాధించారు. కుంటముక్కల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఎం. నవ్యశ్రీ 586 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా కవులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి. నాగధనుష్‌కుమార్ 575 మార్కులతో ద్వితీయ స్థానం, కుంటముక్కల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన బి. పల్లవి 568 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 17 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

విస్సన్నపేట విద్యార్థుల విజయకేతనం



కీర్తన, నరసాపురం గురుకుల పాఠశాల (571)

విస్సన్నపేట: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 76 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ-2 సుధాకర్ సోమవారం తెలిపారు. నాలుగు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. పదో తరగతి పరీక్షలకు 446 మంది విద్యార్థులు హాజరు కాగా 339 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయారన్నారు. ఆంగ్ల మాధ్యమంలో 82 శాతం, తెలుగు మీడియంలో 58 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి దారావతు మురళి 557 మార్కులు సాధించాడని చెప్పారు. నరసాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు 95.45 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 88 మంది హాజరు కాగా 84 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని దారెల్లి కీర్తన 571 మార్కులు సాధించిందన్నారు.

కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నూరు శాతం ఉత్తీర్ణత

గంపలగూడెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గంపలగూడెం మండలంలో 97.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 448 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 434 మంది పాసయ్యారని చెప్పారు. తొమ్మిది పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్, ఊటుకూరు సిద్ధార్థ విద్యాలయం, కేరళ స్కూల్, తోటమూల సాన్‌జోస్ విద్యాలయం, శ్రీ సరస్వతీ విద్యాలయం, శ్రీ గాయత్రి విద్యాలయం, గీతాంజలి విద్యాలయం, గంపలగూడెం విజ్ఞాన్ హైస్కూల్స్‌లో నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. మండల స్థాయిలో గంపలగూడెం లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి వెన్నపూస నవీన్‌రెడ్డి 584 మార్కులతో ప్రథమస్థానం, 581మార్కులతో గొర్ల రూపశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పెద్దగవళ్ల లిఖితశ్రీ 580 మార్కులతో మండల స్థాయి తృతీయ స్థానం, మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ప్రథమస్థానం సాధించిందన్నారు. పి. లిఖితశ్రీని ఎంఈఓ నరసింహారావు, పాఠశాల హెచ్‌ఎం కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అట్టహాసంగా ఎంపీ కేశినేని నాని నామినేషన్

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు
- చంద్రబాబు పెద్ద మోసకారి, అమరావతి బడా స్కామ్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థులు

విజయవాడస్పోర్ట్స్/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) నామినేషన్ సోమవారం అట్టహాసంగా జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరుకావడంతో నామినేషన్ పర్వం కోలాహలంగా సాగింది. విజయవాడ వెస్ట్, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు షేక్ ఆసిఫ్, నల్లగట్ల స్వామిదాస్, సామినేని ఉదయభాను, సర్నాల తిరుపతిరావుయాదవ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు కేశినేని నాని భార్య పావని, కుమార్తెలు శ్వేత, హేమ, అల్లుళ్లు పృథ్వీ, రఘు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉత్సాహంగా ర్యాలీ..

ఉదయమే.. కేశినేని నాని కుటుంబ సభ్యులతో కలిసి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రకీలాద్రి నుంచి నిర్వహించిన ప్రత్యేక ర్యాలీలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత కంట్రోల్ రూం, ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదుగా బందరు రోడ్డులోని కలెక్టరేట్‌కు ఈ ర్యాలీ చేరుకుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ర్యాలీ మధ్యాహ్నం 1.15 గంటల వరకు కొనసాగింది. దారి పొడవునా అభిమానులు గజమాలలు ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. హిందూ, క్రిస్టియన్, ముస్లిం, సిక్కు మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులందించారు. పలువురు మహిళా కార్యకర్తలు హారతులు పట్టారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి కేశినేని నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, దళిత సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా ర్యాలీలో పాల్గొనటంతో సుమారు రెండు కిలోమీటర్ల ర్యాలీ మూడు గంటల పాటు కొనసాగింది. ర్యాలీ కారణంగా ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

ర్యాలీలో ఎ.కొండూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ ముందు బిందెలతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఎంపీగా కేశినేని నాని విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని ఆశీర్వదించారు. గిరిజన వేషధారణలో తలపై బిందెలతో లయబద్ధంగా నృత్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ బృందాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్రపుణ్యశీల, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజన పాలన అందించిన సీఎం జగన్ 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్ ప్రజలకు ఏం కావాలో.. అదే అందించారని కేశినేని నాని అన్నారు. నామినేషన్ పర్వం ముగిసిన అనంతరం కలెక్టర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రమంతటా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు తీసుకొచ్చామన్నారు. వలంటీరు వ్యవస్థతో ప్రజలకు మేలైన సేవలు అందించామని చెప్పారు. గ్రామ, పట్టణ, నగరాల్లో ప్రతి రెండు వేల మందికి ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్య నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వైద్య రంగం అభివృద్ధికి తోడ్పాటు అందించామని తెలిపారు. వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ బడుల రూపు రేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. 2014లోనూ ఇదే మాదిరిగా జనసేన, బీజేపీతో కలిసి చంద్రబాబు పోటీ చేశారని, 650 హామీలను ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. చంద్రబాబు విశ్వసనీయత కోల్పోయాడని, విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా సైతం పోటీ చేసేందుకు అర్హత లేనివాడన్నారు. ఒక కార్పొరేటర్‌కు వచ్చిన ఓట్లు మాత్రమే టీడీపీ ఎంపీ అభ్యర్థికి పడతాయని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల అనంతరం టీడీపీకి తాళం పడిదన్నారు. 2019 ఎన్నికల్లో నవరత్నాలతో పాటు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. అందుకే ఎంతో ధైర్యంతో మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటేయ్యమని సీఎం జగన్ జగన్ ప్రజలను అడుగుతున్నాడని తెలిపారు.



నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



హారతులు ఇస్తున్న మహిళలు

వైభవంగా నాభిశిల ప్రతిష్ఠ

భీమవరం(వత్సవాయి) : గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాభిశిల(బొడ్డురాయి) ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే పూజాకార్యక్రమాలను పూర్తి చేసిన అనంతరం పండితులు నిర్దేశించిన సమయానికి గ్రామ పురోహితులు దుర్భాకుల హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాభిశిలతోపాటు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం, పోతురాజు, రామాలయ శిఖర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐ బి అభిమన్యు బందోబస్తు ఏర్పాటుచేశారు.



నాభిశిల ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలి

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు



చీమలపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వామిదాసు

ఎ.కొండూరు: పేదల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, పేదలకు మేలు జరగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, చీమలపాడు, పెద్దతండా తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి స్వామిదాసు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామిదాసు మాట్లాడుతూ చంద్రబాబు ప్రధాని నరేంద్రమోదీని అనరాని మాటలు అని మరలా బీజేపీతో కలిసి వస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనలో ఎవరికీ ఎలాంటి మేలు జరగలేదన్నారు. జన్మభూమి కమిటీల అరాచకాలతో ప్రజలు పడిన ఇబ్బందులను ఎప్పటికీ మరచిపోలేరన్నారు. ముస్లిం మైనార్టీల రిజర్వేషన్ తీసేస్తామని చెబుతున్న పార్టీలకు, మతతత్వ పార్టీలకు ఓటు అనే ఆయుధంతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలులను వివరించారు. ప్రజలకు మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పిన దమ్మున్న నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సీఎం జగన్ అన్నివర్గాల ప్రజలకు మేలు చేసినందునే ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. నిరుపేదలకు అండగా ఉండే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థిగా కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని చెన్నారావు, నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, సర్పంచులు ముచ్చు సీతయ్య, మోర్ల లక్ష్మి, వైస్ ఎంపీపీ జి. శివారెడ్డి, ఎంపీటీసీ కోలా నాగమణి, నరసింహారావు, పీఏసీఎస్ అధ్యక్షులు జి. వెంకట్రావు, ఎం. సాంబయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బి. నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో ఐదు నామినేషన్ల దాఖలు



తిరువూరు జనవాహిని అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నాగరాజు

మైలవరం: మైలవరంలో సోమవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బొర్రా కిరణ్, భారతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి అక్కల నాగేంద్ర ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుంచి వసంత వెంకట కృష్ణప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుంచి వసంత శిరీష, స్వతంత్ర అభ్యర్థిగా వేములపల్లి పృథ్వీ తమ నామినేషన్లు దాఖలు చేశారు.

తిరువూరులో రెండు నామినేషన్లు..

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు, జనవాహినీ పార్టీ అభ్యర్థిగా బొల్లిపోగు నాగరాజు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మాధవికి సమర్పించారు. ఇప్పటివరకు తిరువూరు నియోజకవర్గంలో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న గుంటుపల్లి వలంటీర్లు

ఇబ్రహీంపట్నం: మండలంలోని దాములూరు, గుంటుపల్లి గ్రామాలకు చెందిన 30 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గుంటుపల్లి సచివాలయ పరిధిలోని 19 మంది, దాములూరుకు చెందిన 11 మంది తమ రాజీనామా పత్రాలు ఎంపీడీఓ ఉమాదేవికి అందజేశారు. గ్రామాల్లో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమను ఎన్నికల నియమావళి పేరుతో విధులకు దూరం చేయడం వలన మనస్థాపంతో రాజీనామా చేసినట్లు వారు ప్రకటించారు.

- విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామ వలంటీర్లు 15 మంది స్వచ్ఛందంగా సోమవారం రాజీనామాలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి. విజయకుమారికి రాజీనామా పత్రాలను అందజేశారు.

రూ.1.50 లక్షల విరాళం

నందిగామ : అంబారుపేటలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం అమ్మవారికి నిత్యపూజలతో పాటు అభిషేకాలు చేశారు. అమ్మవారికి విజయవాడకు చెందిన యానం ఫణేంద్రనాగ్ అనే భక్తుడు రూ.1.50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో సీతారామయ్యకు అందజేశారు.

ఎంపీ కేశినేని నాని నామినేషన్‌కు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్ (నాని) నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు సోమవారం విజయవాడ తరలి వెళ్లారు. ఊటుకూరు, తునికిపాడు, అనుముల్లంక, పెనుగొలను, గంపలగూడెం, కనుమూరు, వినగడప తదితర గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కొన్ని గ్రామాల నుంచి కార్లతో ర్యాలీగా వెళ్లారు.

● విస్సన్నపేట: విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు విజయవాడ తరలి వెళ్లారు. వేమి రెడ్డిపల్లి గ్రామం నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, నెక్కళపు కుటుంబరావు, నాయకులు తరలివెళ్లారు.

సంక్షేమ పాలనకు ఓటేయండి

- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు
- గొల్లపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కుల, మత, పార్టీలు, వర్గాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలనకు ఓటు వేయాలని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం సాయంత్రం గొల్లపూడి గ్రామం నేతాజీ నగర్‌లో పర్యటించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతోపాటు గొల్లపూడి గ్రామంలో ఇప్పటికే దాదాపు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేసిందని, ఇంకా ఏమైనా మౌలిక సదుపాయాలు కావాలంటే గ్రామ పార్టీ నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజాదరణ పొందిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు రూ.2.70 లక్షల కోట్లను నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేసిన సీఎం జగన్ అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన చేస్తున్నారని అన్నారు. జగనన్న సంక్షేమ పాలనను దేశం మొత్తం ఆదర్శంగా తీసుకుంటుందంటే ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే అభ్యర్థినయిన తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకే పాలన అందించిన సీఎం జగన్ చరిత్ర పుటల్లోకి ఎక్కారని సర్నాల తిరుపతిరావు అన్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై విషం కక్కిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వ్యతిరేకత రావడంతో స్వరం మార్చి హామీలు గుప్పిస్తున్నారని, వారి మాయమాటలు ప్రజలు, వలంటీర్లు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. గతంలో మాదిరిగా తాము అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలను నియమిస్తామని వారు ప్రకటించగలరా అంటూ చంద్రబాబుపై ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని, జనబలం ఉన్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు మిగులు సీట్లకు కౌన్సెలింగ్

జి.కొండూరు: కుంటముక్కల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో మిగులు సీట్ల భర్తీ, ఇతర పాఠశాలలకు స్లైడింగ్ కోరుకున్న విద్యార్థులకు మంగళవారం వీరవనేనిగూడెం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు మంగళవారం ఉదయం 9 గంటలలోగా వీరవనేనిగూడెం గురుకుల పాఠశాలకు వెళ్లాలని సూచించారు.

2న ఆలయ భూమి కౌలు హక్కు వేలం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక వసంత వేణుగోపాలస్వామి ఆలయ భూమి కౌలు హక్కుకు టెండర్/బహిరంగ వేలం పాట మే 2వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సీతారావమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 144లోని 11.31 ఎకరాల భూమికి మూడేళ్ల కౌలుకు వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు రూ.50 వేలు డిపాజిట్ డీడీ టెండర్ ఫారంతో జతచేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు.